క్లుప్తంగా

శ్రీపాదరావు విగ్రహం ఏర్పాటుపై హర్షం

కాళేశ్వరం: హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు విగ్రహాన్ని సీఎం రేంవత్‌రెడ్డి ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంపై మహదేవపూర్ బ్లాక్‌కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి మెంగాని అశోక్, జిల్లా మైనార్టీ నాయకులు జానీ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. శ్రీపాదరావు స్పీకర్‌గా ఈప్రాంత ప్రజలకు ఎంతగానో సేవలందించారని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కానుకల లెక్కింపు

మొగుళ్లపల్లి: మండలంలోని ముల్కలపల్లి–మొగుళ్లపల్లి గ్రామాల మధ్య చిన్నవాగు పెద్దవాగు ఒడ్డున నిర్వహించిన సమ్మక్క–సారలమ్మ జాతరలో భక్తులు సమర్పించిన హుండీలలోని కానుకలను నేడు(మంగళవారం) లెక్కించనున్నట్లు ఎండోమెంట్ అధికారి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల బందోబస్తుతో జాతర కమిటీ సభ్యులు ఎండోమెంట్ అధికారుల పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరుగనున్నట్లు తెలిపారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు



చిట్యాల: ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ ఎండీ.ఖాజా మొయిద్దీన్‌ను మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం మర్యాదపూరకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, నాయకులు గుమ్మడి సత్యనారాయణ, దొడ్డి కిష్టయ్య, నంద రాజు, బొట్ల రవి, బుర్ర శ్రీనివాస్ గౌడ్, అల్లకొండ కుమార్, గడ్డం కొమురయ్య, రాజిరెడ్డి, సంతోష్, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



టేకుమట్ల: మండలంలోని జెడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి తన అనుచర వర్గంతో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తిరుపతి రెడ్డికి హైదరాబాద్‌లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి కండువా కప్పి పార్టీకి ఆహ్వానించారు. తిరుపతిరెడ్డితో పాటు నియోజకవర్గం నుంచి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పార్టీలో చేరారు.

8న ఎమ్మార్పీఎస్ సమావేశం

కాటారం: పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఈ నెల 8న నిర్వహించతలపెట్టిన పెద్దపల్లి జిల్లాస్థాయి ఎమ్మార్పీఎస్ సమావేశ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఐఖ్యతను చాటాలని పిలుపునిచ్చారు.

నియామకం



మల్హర్: సేవాలాల్ రాష్ట్ర సేన విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్‌గా మండలంలోని అడ్వాలపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా నవీన్ నాయక్ సోమవారం సేవాలాల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆధ్వర్యంలో విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్‌గా నియామకమయ్యారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

టేకుమట్ల: కుక్కల దాడిలో విద్యార్థితో పాటు మరో వృద్ధుడు గాయపడిన సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి చదువుతున్న రాంచరణ్ పాఠశాల ఆవరణలో ఆడుకుంటుండగా కుక్క దాడి చేసి గాయపరచడంతో కాలికి తీవ్ర గాయమైంది. తోటి విద్యార్థులు కుక్కపై ప్రతి దాడి చేయడంతో పారిపోయింది. అంతటితో ఆగకుండా బస్టాండ్ కూడలిలో మరొక వృద్ధుడిని గాయపరిచింది. గత కొన్ని నెలలుగా పలువురిని గాయపరచడమే కాకుండా పశువులపై సైతం దాడి చేసి గాయపరచడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కొంగు బంగారం మల్లికార్జునుడు!

- నాచారం మల్లన్న గుట్టపై 8 నుంచి ఉత్సవాలు
- అధిక సంఖ్యలో రానున్న భక్తులు
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



నాచారం గుట్టపై ఉన్న మల్లన్న గుడి

మల్హర్: మండలంలోని నాచారం గ్రామ పంచాయతీ పరిసర ప్రాంతంలోని గల గుట్టపై శ్రీ మల్లికార్జున స్వామిగా వెలిసి పూజలు అందుకుంటున్నాడు. మల్లికార్జుడిని కొలిచిన వారికి కొంగు బంగారంగా, కొరుకున్న కోరికలు తీర్చే ప్రత్యక్ష దైవంగా నాచారం మల్లన్న గుట్టగా భక్తులు భావిస్తారు. ప్రతీ సంవత్సరం మహాశివరాత్రిని పురస్కరించకొని 3 రోజులు పాటు నిర్వహించే జాతరకు మండలంలోని ఆయా గ్రామాలు, చట్టూ పక్కల గ్రామాలు, ఇతర జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శిచుకొని మొక్కులు తీర్చుకుంటారు. సంతానం లేని వారు స్వామి వారిని దర్శించుకుంటే సంతాన ప్రాప్తి కలుగుతుందని ఎలాంటి ఆపదలో ఉన్న సరే ఆపద తొలగిపోతుందని భక్తల నమ్మకం.

ఆలయ చరిత్ర

కరీంనగర్ జిల్లా హుజురాబాద్, సింగాపూర్ గ్రామంలో నివసిస్తున్న చేవూరి(దేవుని) మల్లయ్య పరమ శిభక్తుడైన ఓ సాధారణ రైతుకు 1972 సంవత్సరంలో మండలంలోని నాచారం గుట్టపై మల్లికార్జున స్వామి విగ్రహాలు ఉన్నాయని, వాటిని వెలికితీసి గుట్టపై ప్రతిష్ఠించి ప్రతీ సంవత్సరం మహాశివరాత్రి రోజున పూజలు చేయమని చెప్పినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంట్లో భాగంగా తెల్లవారుజామున నాచారం గ్రామంలో దట్టమైన అడవులకు చేరుకొని కొద్ది రోజుల పాటు అన్వేశించారు. గస్తీ తిరుగుతున్న సమయంలో నాచారం గ్రామ చెరువు సమీపంలో ఒక మనిషి రూపంలో దేవుడు వచ్చి విగ్రహాలను మల్లయ్యకు చూపించడంతో గట్టపై ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

8 నుంచి ఉత్సవాలు

ఈనెల 8 నుంచి 10 వరకు మూడు రోజుల పాటు నాచారం మల్లన్న గుట్టలో మహాశివరాత్రి, బ్రహోత్సవముల జాతర నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలుపుతున్నారు. జాతరలో భాగంగా శుక్రవారం రోజున కల్యాణ మహోత్సవం, గణపతి నవగ్రహ, లక్ష్మి హనుమాన్ మూల మత్రహవనం, రెండవ రోజు శనివారం మల్లికార్జుస్వామి పెద్దపట్నం, 3వ రోజు ఆదివారం నైవేద్యం, హారతి, కంకణోధ్వాసన, మహాదాశీర్వాదం, తీర్థప్రసాద వియోగం తదితర కార్యక్రమాలు నిర్వాహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఇప్పటికే జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

తహసీల్దార్ భవనం పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మల్హర్: మండలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ భవనాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం పరిశీలించారు. ఐటీ, శాసన సభ వ్యవహారాల, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేడు(మంగళవారం) మండలంలోని తాడిచర్ల తహసీల్దార్ నూతన భవనం, మల్లారం కసూరిబా గాంధీ పాఠశాల హాస్టల్ భవనం, తదితర అభివృద్ధి పనులు ప్రారంభించనున్న నేపథ్యంలో అడిషన్ కలెక్టర్ పరిశీలించి, ఏర్పాట్లపై తహసీల్దార్, ఇతర అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, తహసీల్దార్ రవికుమార్, పీఆర్ఏఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



మాక్‌పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

మహదేవపూర్: మండలంలోని సూరారం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. కలెక్టర్, జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు రాబోవు పార్లమెంట్ ఎన్నికలను దృష్ట్యా అవగాహన కోసం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటు హక్కు ఆవశ్యకత, ఓటు వేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు రజిత, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శంకర్, సునీత, కవిత, రమాదేవి, గోపికృష్ణ, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై అవగాహన



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ హరీశ్

మల్హర్: మండలంలోని తాడిచర్ల పెంజేరవులో ఉపాధిహామీ పనులపై కూలీలకు ఏపీఓ గిరి హరీష్ సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ.. ఫిష్ బీడింగ్ పనులు చేయడం వలన చేపల పెంపకంకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. మండలంలో జాబ్ కార్డులు కలిగిన వారందరూ 100 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిల్డ్ అసిస్టెంట్ కాల్వ సుమలత, మేడగాని రాజయ్య, మేట్స్ సదయ్య, కూలీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పల్స్ పోలియో'



పల్స్ పోలియో కార్యక్రమంలో డాక్టర్ ఉమాదేవి

మహదేవపూర్: మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సూరారం గ్రామంలో సోమవారం రెండవ రోజు పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిని డాక్టర్ ఉమాదేవి తనిఖీ చేసి మాట్లాడారు. సిబ్బంది పోలియో చుక్కలు వేయడంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామారావు, విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): పల్స్ పోలీయో కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య సిబ్బంది ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 18 పంచాయతీల్లో 82 గ్రామాలు 5990 ఇళ్లను సర్వే చేసినట్లు వైద్యాధికారి భవ్యశ్రీ తెలిపారు. గ్రామాల్లో సర్వే చేసి 74 మంది పిల్లాలకు, బస్టాండ్ ఆవరణంలో 35 మంది చిన్నారులకు పోలియో చుక్కలను వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

మిర్చి కల్లాల్లో పోలియో చుక్కలు

వాజేడు: పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య ఆరోగ్య సిబ్బంది రెండవ రోజు పోలియో చుక్కలను వేశారు. సిబ్బంది ఇంటింటికీ తిరిగి పోలియో కేంద్రాలకు రాలేక పోయిన వారికి చుక్కలను వేశారు. మిర్చి కల్లాలు, తోటల్లో పనులు చేసుకుంటున్న కూలీల పిల్లలకు, వలస కూలీల పిల్లలకు పోలియో చుక్కలను వేశారు.

ఏటూరునాగారం: ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించలని కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకన్న, రఘు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని చేపట్టగా నాయకులు హాజరై పిల్లలకు చుక్కలను వేశారు. కార్యక్రమంలో పోషయ్య, దేవేందర్, ఖలీల్, లాలయ్య, మధబాబు, ఎల్లయ్య పాల్గొన్నారు.

చొక్కాలలో పెసా గ్రామసభ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీఆర్‌కే పురం పంచాయతీ పరిధి చొక్కాల గ్రామంలో సోమవారం మండల వ్యవసాయ అధికారి, పంచాయతీ ప్రత్యేక అధికారి గుంటక నర్సింహారావు అధ్యక్షతన ఇసుక రీచ్ నిర్వహణ కోసం పెసా గ్రామ సభ నిర్వహించారు. దుర్గదేవి గిరిజన ఇసుక లేబర్ కాంట్రాక్టు సొసైటీకి ఇసుక రీచ్ నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తున్నట్లు గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎంపీఈఓ హనుమంతరావు, వెంకటాపురం సీఐ బండారి కుమార్, జెడ్పీటీసీ పాయం రమణ తదితరులు ఉన్నారు.

హద్దులు కేటాయించాలని వినతి

చిట్యాల: గతంలో దళితులకు ప్రభుత్వం కొనుగోలు పథకం కింద కొని ఇచ్చిన 5 ఎకరాల భూమికి హద్దులు కేటాయించి లబ్ధిదారులకు ఇళ్ల కట్టుకునేలా న్యాయం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి పుల్ల మలయ్య, అంబేడ్కర్ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పుల్ల సమ్మయ్య జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో కలెక్టర్ భవేశ్‌మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. గతంలో కొనుగోలు పథకం కింద చిట్యాల మండల కేంద్రంలోని చిట్యాల శివారులో సర్వే నంబర్ 162/2, 166/2 లో 5 ఎకరాల ప్రైవేటు భూమిని కొని 110 మంది ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారని అన్నారు. అట్టి భూమిలో హద్దులు సరిచేయాలని గతంలో పాలకులకు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన న్యాయం జరగలేదని అన్నారు. ప్రభుత్వం దళితులను ఇళ్ల నిర్మించుకోవాలని చెప్పిందని కాని ప్రస్తుత భూమి యాజమాని కోడేల సమ్మయ్య 10 మంది దళితులపై కోర్టులో కేసు వేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్, సంబంధిత జిల్లా, మండల అధికారులు భూమికి హద్దులు సరిచేసి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు కనకం తిరుపతి, పుత్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

భూపాలపల్లి రూరల్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) డైరీని సోమవారం భూపాలపల్లి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సంపత్‌రావు చేతుల మీదుగా అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మంద సంపత్, జిల్లా అధ్యక్షుడు మహేందర్, నాయకులు గుర్రం దేవేందర్, శ్రీధర్, మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మానవహారం నిర్వహిస్తున్న మహిళలు

భూపాలపల్లి రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని భూపాలపల్లి కెనరా బ్యాంకు మేనేజర్ శివకుమార్ అన్నారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డీటీ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఆర్‌డీటీ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు లక్ష్మయ్య, వరలక్ష్మి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఏటూరునాగారం/మంగపేట: మంగపేట మండలం నర్సింహాసాగర్ పంచాయతీ పరిధిలోని శనిగకుంట గ్రామానికి చెందిన దేవేందర్‌కు నివాస గృహం ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. దీంతో తక్షణ సాయం కింద ఐటీడీఏ పీఓ. చిత్ర మిశ్రా రూ.25వేలు మంజూరు చేయగా ఆ చెక్‌ను సోమవారం ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, ఐటీడీఏ ఎస్‌ఓ రాజ్‌కుమార్ బాధితులకు అందజేశారు. ట్రైబల్ రిలీఫ్ ఫండ్ కింద తక్షణ సాయం అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మంగపేట: మండలంలోని శనిగకుంటలో పూరిల్లు దగ్ధమైన దేవేందర్ కుటుంబానికి ఎస్సై గోదారి రవికుమార్ సోమవారం రూ.10,000 విలువైన ఇంటి సామగ్రితో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. మరింత సహాయం అందే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే దేవేందర్ కుటుంబాన్ని బీజేపీ మండల నాయకులు సోమవారం పరామర్శించారు. మండల అధ్యక్షుడు పల్నాటి సతీష్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, దుస్తులు, రూ.1000 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, శ్రీనివాస్, పూర్ణచందర్‌రావు, యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

కాటారం: దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, సామగ్రి పంపిణీ చేశారు. సుమారు 25 మంది విద్యార్థులకు పరీక్షా సమయంలో ఉపయోగపడే పరీక్షా సామాగ్రిని సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు బోయిని ప్రశాంత్, కోడల వెంకటస్వామి, సాదనవేని మోహన్, ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవాకేంద్రం ప్రారంభం



ప్రజాపాలన సేవాకేంద్రంలో అధికారులు



మహదేవపూర్‌లో..

మహాముత్తారం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు సోమవారం ప్రజాపాలనలో కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలు గృహజ్యోతికి సంబంధించిన దరఖాస్తులను సేవాకేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షణ అధికారి రమేష్ బాబు తదితరులు ఉన్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖస్తుదారుల సేవా కేంద్రాన్ని ఎంపీపీ రాణిబాయి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల అమలు కోసం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రసాద్ కార్యాలయ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు నీరు!

- కంపుకొడుతున్న మరుగుదొడ్డి లీకేజీలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



రోడ్డుపై పారుతున్న వ్యర్థపునీరు

ములుగు: వందల గ్రామాల ప్రజలను గమ్యస్థానానికి చేర్చే జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో నిలబడేందుకు నానా తంటాలు పడుతున్నారు. బస్టాండ్ ఎదుట నిర్మించిన మరుగుదొడ్డి వ్యర్థపునీరు రోడ్డుపై పారుతోంది. సుమారు 250 మీటర్ల చుట్టూ వరకు ఈ దుర్వాసన వస్తోంది. దీంతో ప్రయాణికులు ముక్కున వేలు వేసుకొని బస్సుల కోసం వేచిచూడడం తప్పా చేసేదేమీ లేక ఆర్టీసీ అధికారుల తీరు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం దుమ్మెత్తి పోస్తున్నారు. ఈ విషయంలో గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా మరమ్మతు చేపట్టడం లేదని వాపోతున్నారు. ఇటీవల ఆర్టీసీ అధికారులు వచ్చి చూసి వెళ్లారని, పనులు మాత్రం మొదలుపెట్టలేదని స్థానికులు అంటున్నారు.

ప్రైవేటు వాహనాలకు సైతం ఇదే అడ్డా..

బస్టాండ్‌లో వైశాల్యం ఎక్కువగా ఉండటంతో ప్రైవేటు వాహనాలు ఇక్కడే ఎక్కువగా పార్కింగ్ అయి ఉంటాయి. అబ్బాపూర్, పర్కాల, గణపురం, పెద్దాపురం, సర్వాపురం, రాయినిగూడెం వంటి గ్రామాలకు ప్రైవేటు సర్వీసులు నడుస్తుంటాయి. ఆటోలు నిండేంత వరకు ఇక్కడే వేచి చూస్తుంటారు. ములుగు ప్రత్యేక డిపో లేకపోవడంతో ప్రయాణీకులు, ఉద్యోగులు, విద్యార్థులను తరలించేందుకు హనుమకొండ, పరకాల, జయశంకర్ భూపాలపల్లి, నర్సంపేట వంటి డిపోల నుంచి జిల్లాలోని నలుమూలలతో పాటు హైదరాబాద్, కరీంనగర్, జనగామ వైపుగా బస్సు సర్వీసులు నడుస్తాయి. బస్టాండ్ దగ్గర ఉన్న మరుగుదొడ్లను ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు వినియోగిస్తుంటారు. దీంతో మరుగుదొడ్ల లీకేజీ నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ఏరియా చుట్టూ పదుల సంఖ్యలో సెలున్లు, చైనా బజార్లు, హోటళ్లు వంటివి ఉన్నాయి. దుర్గంధం సమస్య ఉన్నప్పటి నుంచి వ్యాపారం ఢీలా పడిపోయిందని షాపుల యజమానులు వాపోతున్నారు.

కస్టమర్లు రావడం లేదు



గత పదిరోజులుగా ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిర్మించిన మరుగుదొడ్డి పైప్‌లైన్ డ్యామేజ్ అయి మురుగునీరు రోడ్లపై పారుతున్నాయి. దుర్వాసన కారణంగా రెగ్యులర్‌గా వచ్చే కస్టమర్లు కూడా రావడం లేదు. వ్యాపారం చాలా దెబ్బతింది. ఒకరో ఇద్దరో వచ్చినా డోర్లు దగ్గర పెట్టుకొని పనిచేసుకుంటున్నాం. మరో వారం రోజులు ఇలాగే ఉంటే షాపులు బంద్ చేసుకోవాల్సిందే.

– చిక్కుల శివాజీ, సెలూన్ నిర్వాహకుడు

'గృహజ్యోతి' ప్రారంభం



జీరో బిల్లును అందిస్తున్న నాయకులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో కాంగ్రెస్ నాయకులు గృహ జ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్) పథకాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీటర్‌తో రీడింగ్ తీసి జీరో బిల్లును వినియోగదారులుకు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు ఈ పథకం ఓ వరం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేసారపు చంద్రయ్య, ఇందారపు చంద్రయ్య, బబ్బిలి రాజు, కుంట సదానందం, రావుల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.